క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహ వాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలక ర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం

పెందుర్తి: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ మహిళకు పెందుర్తి పోలీసులు తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి, ఇతర అక్రమ రవాణా నిఘా ప్రక్రియలో భాగంగా పెందుర్తి కూడలి వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్‌ను తనిఖీ చేస్తుండగా అయోమయంగా ఉన్న ఓ మహిళ (60)ను గుర్తించారు. ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేయగా చెప్పలేకపోయింది. దీంతో ఆమె స్థానిక లయోలా వృద్ధాశ్రమానికి తరలించారు. మహిళ ఆచూకీ కోసం ఫోన్:94407 96039(పెందుర్తి సీఐ) నెంబర్‌కు సంప్రదించాలని సీఐ సూచించారు.

చేప చిక్కక.. పూట గడవక..

- సముద్రంలో కలుస్తున్న పరిశ్రమల కాలుష్యం
- తగ్గిపోతున్న మత్స్య సంపద
- అర్ధాకలితో మత్స్యకారులు



ఒకవైపు పరిశ్రమల కాలుష్యం, మరోవైపు తరచూ సంభవిస్తున్న తుఫాన్లు... ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా చేపల వేట సరిగా సాగక, దీని వల్ల చిరుచేపల వేట కూడా సాగడం లేదని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలారీపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆకలితో అలమటిస్తున్నారు.

పరవాడ : చేపల వేట నిషేధం ముగిసిన తర్వాత జూన్ 15 నుంచి సముద్రంలో వేట ప్రారంభించినా ఆశించిన స్థాయిలో చేపలు దొరకడం లేదు. దీంతో చాలామంది మత్స్యకారులు వేటకు వెళ్లడం మానేసి ఇళ్లకే పరిమితమవుతున్నారు. మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం తెప్పలపై కష్టపడి వెళ్లినా ఖర్చులకు కూడా సరిపడా చేపలు చిక్కడం లేదని వారు వాపోతున్నారు. వేకువజామున 4 గంటలకు వేటకు వెళ్లి గంటల తరబడి ఎదురుచూసినా ఫలితం ఉండటం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్యాలమ్మపాలెం తీరంలో దాదాపు 120 తెప్పలపై వందలాది కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు రొయ్యల సీజన్ ముగింపు దశకు చేరుకున్నా, ఈ సంవత్సరం ఒక్క పసం (80 రొయ్యలు) కూడా దొరకలేదని గంగపుత్రులు చెబుతున్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో ఒక్కో తెప్పకు లక్షల రూపాయల విలువైన రొయ్యలు లభించేవి. కానీ, ఈసారి తీవ్ర నిరాశే ఎదురైంది.

కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావం

ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా పరిశ్రమల కాలుష్యం, వాతావరణ ప్రతికూల పరిస్థితులను మత్స్యకారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఫార్మా సిటీ , ఎన్టీపీసీ నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి వదలడం వల్ల మత్స్య సంపద నాశనమవుతోందని ఆరోపిస్తున్నారు. దీనివల్ల చేపలు, రొయ్యలు చనిపోతున్నాయి. వరుసగా వస్తున్న తుఫాన్లు కూడా చేపల వేటను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా లభించే కోనాం, సార, వంజ్రాలు, సూరలు వంటి చేపలు కూడా దొరక్కపోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని మత్స్యకారులు చెబుతున్నారు. కుటుంబ పోషణ కోసం కొందరు ఏలూరు, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

ఎన్టీపీసీ వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవడంతో వారు వాపోతున్నారు. చేపల వేటనే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను కల్పించాలని వారు కోరుతున్నారు. రెండు నెలల నుంచి చేపల వేట లేకపోవడంతో ఇంట్లో కూర్చొని పాత వలలు కుట్టుకుంటూ కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



చేపల వేట సాగక షెడ్ల వద్ద చినిగిన వలలు కుట్టుకుంటున్న గంగపుత్రులు



ప్రతికూల పరిస్థితులతో ఒడ్డుకు చేర్చిన తెప్పలు

ఆదాయాన్ని కోల్పోయాం



నిషేధం అనంతరం ప్రారంభం కానున్న రొయ్యల సీజన్ ఈ నెలతో పూర్తి కావస్తుంది. గతంలో జూన్ నుంచి ఆగస్టు వరకు వలలకు భారీగా రొయ్యలు చిక్కేవి. రోజుకు లక్షల రూపాయల రొయ్యలు దొరికేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకుండా పోయాయి. కనీసం మచ్చుకైన రొయ్యల జాడ కనిపించలేదు. లక్షలది రూపాయల ఆదాయాన్ని కోల్పోయాం. సాదారణ చేపల వేట కూడ అంతంతమాత్రంగా ఉంది. వేట సాగకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. –కంబాల ముత్యాలు, జాలారీపేట

డీజిల్ ఖర్చులు కూడా రాలేదు



ఆశించినంత మేర సముద్రంలో చేపల వేట సాగడం లేదు. ప్రతీ రోజు చేపల వేటకు వెళితే ఆరేడొందల విలువ చేసే చేపలు లభిస్తుండడంతో డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదు. ఆరుగురితో తెప్పపై చేపల వేటకు వెళితే రూ.1000–1500 ఖర్చవుతుంది. చేపలు చిక్కితే లాభసాటిగా ఉంటుంది. కానీ ఒక్కోసారి డీజిల్ ఖర్చులకైన వస్తాయని ఆశించిన ప్రయోజనం కనిపించడం లేదు. చేపల చిక్కక నిరాశతో వెనుదిరుగుతున్నాం. –సూరాద మసేను, ముత్యాలమ్మపాలెం

రసాయన వ్యర్థాలతో నష్టపోతున్నాం



ఫార్మా పరిశ్రమల రసాయన వ్యర్థాలు, ఎన్టీపీసీ బూడిద వ్యర్థ జలాలు సముద్రంలో కలవడం వల్ల చేపలు నశించిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం. పరిశ్రమలు రాక మునుపు చేతి నిండ పని దొరికేది. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. ప్రస్తుతం చేపల వేట సాగక వలస కూలీలుగా మారవలసి వస్తుంది. చేపల వేట లేక కుటుంబాలను పోషించుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. రెండు నెలలుగా చేపల వేట సాగక కుటుంబాలు అర్ధాకలితో అలమటిసున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. –గనగళ్ల బంగారి, మత్స్యకార్మికుడు

తమ్మినేని,ధర్మానతో అదీప్‌రాజ్ భేటీ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన పెందుర్తి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌లను శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నియమకానికి సహకారం అందించనందుకు ధన్యవాదాలు తెలిపారు. - పెందుర్తి

గుండెపోటుతో మరణించిన వృద్ధుని నేత్రదానం



మరణించిన సూరిబాబు కళ్ళు తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి: పెందుర్తి మాజీ ఎంపీపీ పులమరశెట్టి సరస్వతి భర్త సూరిబాబు (79) శనివారం గుండెపోటుతో మరణించారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం నేత్రాలు దానం చేసి మానవత్వాన్ని చాటుకుంది. చింతలగ్రహారంలోని తన నివాసంలో సూరిబాబు కన్నుమూయగా, సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ నేత్ర దానం చేయాల్సిందిగా ఆయన కుటుంబాన్ని కోరారు. మృతుని కుమారుడు పులమరశెట్టి శ్రీధర్ వెంటనే అంగీకరించారు. వ్యాపారవేత్త దాడి రమణచిట్టి, మద్దాల శ్రీను సమక్షంలో ఒప్పంద పత్రాలు అందజేశారు. అనంతరం ఎల్‌వీ ప్రసాద్ నేతృత్వంలోని మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు సూరిబాబు నేత్రాలను సేకరించి ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఈ దాతృత్వాన్ని స్థానికులు ప్రశంసించారు. కాగా సూరిబాబు దివంగత మాజీ మంత్రి, మాజీ ఎంపీ ఎస్ఆర్ఎస్ అప్పలనాయుడుకు అల్లుడు.

శ్రీవారి ఆలయానికి భక్తుల తాకిడి

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ముందుగా ఇక్కడికి చేరుకున్న భక్తులు శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి, గోదాదేవి, ఆంజనేయ స్వామి వార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పెందుర్తిలో జడివాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- 66.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



పెందుర్తి కూడలి వద్ద జోరు వాన



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిని ముంచెత్తిన వర్షం

పెందుర్తి: పెందుర్తిని వరుసగా రెండోరోజు జడివాన ముంచెత్తింది. శనివారం రాత్రి కురిసిన ఎడతెరిపిలేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రెండు గంటల వ్యవధిలో 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో పెందుర్తి జంక్షన్ పెద్ద చెరువును తలపించింది.

నగరంలోని ప్రధాన కూడలిలో ఒకటైన బీఆర్‌టీఎస్ రహదారిపై కూడా వర్షపు నీరు ఏరులై పారింది. వర్షపునీటికి మురుగునీరు తోడవడంతో పట్టణ ప్రాంత ప్రజలు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నగరం వైపు వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరుస వర్షాల కారణంగా రైతులు పొలం పనులకు సిద్ధమవుతున్నారు. ఆదివారం నుంచి దమ్ము, వరినాట్లు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెందుర్తి కూడలి వద్ద శనివారం సాయంత్రం ఒక మహిళ కదిలించని దృశ్యం కనిపించింది.

ఓ వైపు జోరువాన, మరోవైపు వరద నీరు ఉన్నా ఆమె తన ఆశను వదులుకోలేదు. 'ఒక్క పూవైనా అమ్ముడు పోదా?' అన్న ఆశతో ఆమె వర్షంలోనూ తన పూల వ్యాపారం కొనసాగించింది. ఆమె రోజు వ్యాపారం చేసే స్థలం నుంచి వరద నీటిలోనూ పక్కకు జరగలేదు.

సబ్బవరంలో మతిస్థిమితం లేని యువకుడి మృతి



మృతుడు అజయ్ (ఫైల్)

సబ్బవరం: మండలంలోని చిన్నయ్యపాలెం సమీపంలో ఉన్న బోర్రమ్మ గెడ్డ వద్ద లభ్యమైన మృతదేహాన్ని సబ్బవరం పోలీసులు గుర్తించారు. ఈ మృతదేహం అజయ్ అనే మతిస్థిమితం లేని యువకుడిదని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం , సుమారు 30 ఏళ్ల వయసున్న ఈ యువకుడు గత మూడు రోజులుగా గుల్లేపల్లి, సూరెడ్డి ప్రాంతాల్లో తిరుగుతూ కనిపించాడు. ఇతనికి తెలుగు రాకపోవడంతో ఉత్తర భారతదేశానికి చెందిన వ్యక్తి అయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శరీరంపై బట్టలు లేకుండా తిరుగుతుండగా, సూరెడ్డిపాలెం గ్రామస్తులు ఇతనికి కొన్ని దుస్తులు ఇచ్చారు. చిన్నయ్యపాలెం సమీపంలోని దాబాల యజమానులు, స్థానికులు ఇతడిని అజయ్‌గా గుర్తించారు. అనారోగ్యంతో బాధపడుతూ కానీ, గెడ్డలో జారి పడడం వల్ల కానీ మరణించి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మల్లునాయుడుపాలెం వీఆర్‌ఓ శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్బవరం సీఐ రామచంద్రరావు తెలిపారు.

హే కృష్ణా.. ముకుందా.. మురారీ



లక్ష్మీనరసింహనగర్‌లో కొలువుదీరిన గోపీజనవల్లభ స్వామి

పెందుర్తి: నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఆధ్యాత్మిక శోభతో అంబరాన్ని తాకాయి. చిన్నారులు ముద్దుల వెన్నదొంగలు, గోపికల వేషధారణలతో అలరించగా, యువత ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి గోపాలకృష్ణుడి సేవలో తరించారు. పురుషోత్తపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే సంబరాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఏపీ ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితర రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. దాదాపు 8 వేల మంది భక్తులు పూజల్లో పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. సాంప్రదాయ నృత్యాలు, జానపద కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను తెచ్చాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, యాదవ సంక్షేమ సంఘం నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంతినగర్: బృందావన విహార్ కాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో సుమారు 500 మంది ప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రతినిధులు మోరి సింహాచలం, నాయుడు, ఆదినారాయణ, చిన్న, శంకర్రావు, మురళికృష్ణ, రాజశేఖర్, కామేశ్వరరావు, సూర్యకళ, తులసి, జగన్, శోభారాణి, ఝాన్సీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

జంగాలపాలెం: ఇక్కడ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పీఏసీఎస్ ఛైర్మన్ అయిత సింహాచలం, సర్పంచ్ నరసింగరావు సమక్షంలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 3 వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు.

బంధంవానిపాలెం: ముదపాక పంచాయతీ పరిధిలోని వందలాది మంది భక్తులు కృష్ణష్టమి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం సందడిగా సాగింది.

దొగ్గవానిపాలెం: స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.

సౌభాగ్యరాయపురం: ఎస్ఆర్ పురంలోని శ్రీకృష్ణ దేవాలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి. సుమారు 2 వేల మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించగా, ఉట్టి ఉత్సవం కన్నులపండువగా సాగింది.



పురుషోత్తపురంలో శ్రీకృష్ణుని సన్నిధిలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, గండి రవికుమార్



శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



చిన్నికృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి ప్రియాన్షి



ఉట్టి సంబరాలు



ఆక్స్‌ఫర్డ్‌లో కృష్ణాష్టమి సంబరాలు

సుజాతనగర్: ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బొట్టవానిపాలెంలో

పరవాడ: రావాడ శివారులోని బొట్టవానిపాలెం గ్రామంలో కొలువుదీరిన శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకల్లో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సారిపల్లి జోగినాయుడు, కోరుకొండ కొండడు, బి. నూకరాజు, నాని, నాగేశ్వరరావు తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నాయుడుపాలెం శివారులోని గొల్లపేట గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు. వారు మొదట స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకృష్ణ భగవానుడు ప్రజలందరినీ అష్ట ఐశ్వర్యాలతో ఆశీర్వదించాలని కోరుకుంటున్నానన్నారు. గీతాసారంతో జీవిత సత్యాన్ని బోధించిన శ్రీకృష్ణుడిని స్మరించుకోవడం అంటే, మన కర్తవ్యాన్ని మనం గుర్తు చేసుకొని ముందుకు సాగడమేనని అన్నారు. ఈ ప్రాంత ప్రజలపై శ్రీకృష్ణుడి కృపా కటాక్షం ఉండాలని తాను కోరుకుంటున్నానని అదీప్‌రాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు, నాయకులు పైల అప్పలనాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, నాయకులు సారిపల్లి నేస్తాలు, సోమునాయుడు, ముత్యాలనాయుడు, మరియు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: సబ్బవరం, రాయపుర అగ్రహారం గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సబ్బవరంలోని గోపాలనగర్ శ్రీకృష్ణమందిరంలో ఆలయ అభివృద్ధి కమిటీ, యువత ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన జట్లకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బహుమతులు అందించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. స్వామివారిని దర్శించుకోన్నవారిలో వైఎస్సార్ సీపీ నాయకులు గండి రవికుమార్, కొటాన రాము, పల్ల కృష్ణ, యడ్ల నాయుడు తదితరులు ఉన్నారు. ఉదయం నుంచి ఆలయ సన్నిధిలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాయపుర అగ్రహారం గ్రామంలో కూడా ఇదే తరహాలో వేడుకలు నిర్వహించారు.



జంగాలపాలెంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న పీఏసీఎస్ ఛైర్మన్ అయిత సింహాచలం

వాడవాడలా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సింహాచలం శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం 98వవార్డు పరిధిలో వాడవాడలా ఘనంగా జరిగాయి. గోపీజనవల్లభస్వామి ఆలయంలో క్షీరాభిషేకం, సహస్రనామార్చన, విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధనతో పాటు సాయంత్రం 108 రకాల ప్రసాదాలతో నివేదన, ఊంజల్ , బాలకృష్ణ వేషధారణ పోటీలు, సరస్వతి నృత్యమందిర్ వారి భరతనాట్య ప్రదర్శన కూడా భక్తులను ఆకట్టుకున్నాయి.యాదవుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.నక్కాన బ్రదర్స్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన ఈ పోటీల్లో ఐదు టీమ్‌లు పాల్గొన్నాయి.ఈ వేడుకలను ఆలయ కమిటీ, నక్కాన రవి యాదవ్, యాదవుల సంఘం నాయకులు పర్యవేక్షించారు. 98వవార్డు లక్ష్మీనరసింహనగర్‌లో గోపీజనవల్లభ స్వామి ఆలయంలో స్వామిని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. స్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పిలి కనకరాజు, దేవి సాంబ, రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగ్, బర్ల రాంబాబు, పీతల విష్ణు మూర్తి, జగదీష్, వేపాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలపై అవగాహన

సబ్బవరం: రాయపుర అగ్రహారం గ్రామంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సబ్బవరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ ఎ. రమేష్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉదయం 8 నుండి 10 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ ఎ.వి. రమణమూర్తి, జోనల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్‌తో పాటు ఇతర అధికారులు హాజరవుతారు.